కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడో...?



దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయం

- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికీ కొత్తగా మంజూరు కాని పింఛన్
- దరఖాస్తు చేసుకునేందుకు తెరచుకోని వెబ్ సైట్
- ఎదురు చూస్తున్న వేలాదిమంది అర్హులు

దత్తిరాజేరు: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిపోయినప్పటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా కొత్తగా సామాజిక పింఛన్ మంజూరు చేయలేదు.కొత్తపింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్న వాటిలో కోత విధించే పనిలో ప్రభు త్వం బిజీగా ఉంది. అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామంటే సంబంధిత వెబ్‌సైట్ తెరచుకోవడం లేదు. పింఛన్‌కు అర్హు లైన వృద్ధులు, దివ్యాంగులు, వితం తువులు ఎప్పుడు వెబ్‌సైట్ తెరచుకుంటుందా, దరఖాస్తు చేసుకుందామా అని నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులు దరఖాస్తు చేసుకుంటే రోజుల వ్యవధిలో పింఛన్లు మంజూరయ్యేవి. వితంతు పింఛన్ అయితే మరింత వేగంగా మంజూరయ్యేది. భర్త చనిపోయిన వెంటనే డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో సమర్పించడమే తరువాయి వితంతు పింఛన్ మంజూరు చేసే వారు. ఇదంతా 2024 ఎన్నికల కోడ్ రాకముందర వరకు పరిస్థితి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఆపరిస్థితి లేదు. భర్త చనిపోయి ఏడాది అవుతున్నా ఇంకా వితంతు పింఛన్ మంజూరు కాక గజపతినగ రం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వృద్ధులు కూడా అల్లాడుతున్నారు. పింఛన్ వస్తే కనీసం మందులు ఖర్చులకైనా ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేదని ఆశిస్తుం టే.... ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రావడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ హామీని సైతం ఇంకా అమలు చేయలేదు.

వెబ్ సైట్ ఓపెన్ కాలేదు

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత వెబ్ సైట్ ఓపెన్ కాలేదు. దరఖాస్తు సచివాలయంలో ఇస్తే పేర్లు నమోదు చేస్తారు. పాత పింఛన్ల పరిశీలన పూర్తయిన తర్వాత కొత్త పింఛన్లకు అవకాశం ఉంటుంది.

– వై.వి.రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ, దత్తిరాజేరు

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం,బొండపల్లి, గంట్యాడ మండలాల్లో సుమారు మూడు వేల మందికి పైగా అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసుకునేం దుకు వీరంతా గ్రామసచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తరచూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత వెబ్‌సైట్ తెరచుకోవడం లేదనే సమాధానం మండ ల పరిషత్ కార్యాలయాల, సచివాలయాల సిబ్బంది నుంచి వినిపిస్తోంది. గతంలో ఏడాదంతా పింఛన్లకు సంబం ధించిన వెబ్ సైట్ ఓపెన్‌లో ఉండేది. అర్హులకు సచివాలయంలో రోజూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో తామేమీ చేయలేమని ఎంపీడీఓ కార్యాలయాలు, సచివాలయాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

● ఘనంగా కందుకూరి జయంతి



సంఘ సంస్కర్త, నవల, నాటక రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి జీవిత విశేషాలను తెలుగు ఉపాధ్యాయిని విద్యార్థినుల కు వివరించారు. – లక్కవరపుకోట

● డంపింగ్‌యార్డు కాదు రోడ్డే...



ఈ చిత్రంలో కనిపిస్తున్నది డంపింగ్‌యార్డు అనుకుంటే పొరపాటే. అదేంటి అంత చెత్త కుప్ప కనిపిస్తుంటే డంపింగ్ యార్డ్ కాదంటున్నారని అనుకుంటున్నారా..?. ఇది చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట గ్రామంలో శ్మశానవాటికతో పాటు పంట పొలాలకు వెళ్లే రోడ్డు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆ రోడ్డుపై చెత్త చేరి ఇలా డంపింగ్‌యార్డు లా మారింది. పక్కనే ఉన్న కాలువ పూడికతో మూసుకుపోవడంతో అందులో నుంచి వెళ్లాల్సిన చెత్త ఇలా రోడ్డు పైకి చేరింది. దీంతో ఆమార్గంలో పంట పొలాలకు వెళ్లే రైతులు బుధవారం ఇబ్బందులు పడ్డారు

– చీపురుపల్లి

క్లుప్తంగా

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ఆవిష్కరించారు.కళాశాలకు అదనపు తరగతి గదులు మం జూరు చేయాలని, ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయాలని ప్రిన్సిపాల్ భీమ శంకర్, అధ్యాపకులు ఎమ్మెల్యేను కోరారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న వంశీకృష్ణ, విహార్

చీపురుపల్లి: ఇటీవల శబరిమల వనయాత్ర చేసిన పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాముల బృందం పట్టణంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి రూ.18 వేలు విరాళం అందజేసింది. నగదును ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీపీ తనయుడు ఇప్పిలి విహార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణు, నాగు, ఒమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, ముల్లు పైడిరాజు, కొమ్ము చిరంజీవి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



సత్యానారాయణ స్వామి వ్రతం చేస్తున్న దంపతులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు రోజున ప్రత్యేక పూజలతోపాటు ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులతో పాటు పలువురు దంపతులతో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన



గజపతినగరంలో పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ మోహన్‌రావు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంతో పాటు మరుపల్లి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా ల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను డీఎల్‌పీఓ మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో చెత్త కుండీలు, వర్మీ కంపోస్టు కుండీలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తలో తడి, పొడి చెత్తను వేరుచేయాలని, వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేయడంతో పాటు పరిసరాలు అధ్వానంగా ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, కార్యదర్శి గొల్లపల్లి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కిడ్స్ కాన్వొకేషన్



కాన్వొకేషన్‌లో చిన్నారులు

శృంగవరపుకోట: స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో కిడ్స్ కాన్వొకేషన్‌ను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.మధుబాల మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని,వారి ఉజ్వల భవిష్యత్‌ను తీర్చి దిద్దే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం ద్వారా వారిలోని ఆత్మవిశ్వాసం పెరిగి వారికి మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నీలిమ, నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జ్ వెంకటేష్, సీజీఎం వసంత, జీఎం కె.రమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

దత్తిరాజేరు: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన వంద మద్యం బాటిళ్లను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర ఆధ్వర్యంలో ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్ లో బుధవారం ధ్వంసం చేశారు. ఎస్‌ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారంలో పీఆర్టీయూ నాయకులు



శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుతో ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ నాయకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై న గాదె శ్రీనివాసులునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ సంఘ నాయకులు పాల్గొన్నారు. విజయవాడలో బుధవారం జరిగిన శ్రీనివాసులునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆల్తి రాంబాబు, నాయకులు ఆర్.సింహాద్రి, ఎం.జగన్నాథం ,తాలాడ మహేష్, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

పదోన్నతి కల్పించాలని వినతి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు

వేపాడ: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న తమకు పదోన్నతి కల్పించాలని మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎమ్మెల్యేను ఎల్.కోటలోని ఆమె నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు మాట్లాడుతూ తమకు బీసీ, సోషల్, ట్రైబల్, మైనార్టీ వెల్ఫేర్, డిజేబుల్ డిపార్ట్‌మెంట్‌తో పాటు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లలో పదోన్నతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రేమ్‌కుమార్, నారాయణరావు, కృష్ణ, సత్యవేణి, ప్రతాప్ తదితరుల పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ కార్మికుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కార్మికులు

చీపురుపల్లి: తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కర్లాం వద్ద ఉన్న శ్రీ వెంకటరామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులు పౌల్ట్రీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేశారు. పరిశ్రమ వద్ద ఎర్ర జెండాలతో బయలుదేరిన కార్మికులు దాదాపు పది కిలోమీటర్లు నడిచి చీపురుపల్లిలోని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు క్యాంప్ ఆఫీస్‌కు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కుమారుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, అంబల్ల గౌరునాయుడు మాట్లాడుతూ శ్రీ వెంకటరామా పౌల్ట్రీ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు న్యాయమైన కోర్కెలు అడిగితే వారిని తొలగించిడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, స్థానికులకే 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు గురునాయుడు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భూమనపై ఆరోపణలు సబబు కాదు



విలేకరులతో మాట్లాడుతున్న చినరామునాయుడు

వేపాడ: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) గోశాలలో ఆవుల మృతిపై టీటీడీతో పాటు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపణలు చేయడం సబబు కాదని డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు అన్నారు. నీలకంఠరాజపురంలో బుధవారం నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై భూమన కరుణా కరరెడ్డి మాట్లాడిన దాంట్లో తప్పేముందని ప్రశ్నించారు. గోశాలలో గత మూడు నెలల్లో 43 గోవులు మృతి చెందాయని టీటీడీ ఈఓ శ్యామల రావు ప్రకటించిన విషయం నిజం కాదా అని ఎమ్మెల్యే లలితకుమారిని ప్రశ్నించారు. టీటీడీని కూటమి రాజకీయాలకు వాడుకుంటోందని మండిపడ్డారు. గోవుల మృతికి సంబంధించిన అంశంలో సీఎం చంద్రబాబునాయుడు, టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు,ఎమ్మెల్యే లలితకుమారి తలోరకంగా మాట్లాడుతూ, వాస్తవాలను వక్రీకరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి భూమనకు ఎమ్మెల్యే లలితకుమారి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చిన గుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శీరరెడ్డి జగ్గినా యుడు, వంటాకు ప్రసాద్, సింహాచలం నాయుడు, దేముడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ సత్యనారాయణ

గంట్యాడ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా క్యాంప్ కోర్టు లు నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (క్యాంప్ కోర్ట్) నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు ఉంటే వినియోగదారులు 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే సిబ్బందిపై ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందించాలని, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 200 లోపు విద్యుత్ యూనిట్లను వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు, పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడు తుండడం, తదితర సమస్యలపై 11 ఫిర్యాదులు అందాయని చెప్పారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సభ్యులు సుబ్బారావు, మురళీ కృష్ణ ,తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



కొత్తవలస: మంటలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



గజపతినగరం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్



శృంగవరపుకోట: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గజపతినగరం/కొత్తవలస/శృంగవరపుకోట: అప్రమత్తంగా ఉండడంతో పాటు జాగ్రత్తలు పాటించడం ద్వారానే అగ్ని ప్రమాదా లను నివారించవచ్చని గజపతినగరం, కొత్తవలస, ఎస్.కోట అగ్నిమాపక శాఖ అధికారులు ఎం.ఎస్.వి.రవిప్రసాద్, వై.అశోక్ కుమార్, షేక్ మదీనా అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గజపతినగరంలోని మెంటాడ జంక్షన్ వద్ద అపార్ట్‌మెంట్ వాసులకు, కొత్తవలసలోని టీచర్స్ పారడైజ్ గృహ సముదాయాలు,ఎస్.కోటలో శివసాగర్ కుటీర్ అపార్ట్‌మెంట్, గౌరీనగర్ కాలనీ ప్రాంతాల్లో మహిళలకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గ్యాస్ లీకేజ్ వల్ల వచ్చే మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.గ్యాస్‌పై వంటలు చేసేటప్పుడు ఏమరపాటు పనికిరాదని చెప్పారు. అపార్టుమెంట్‌లలో అగ్నిప్రమాదం సంభవించే సమయాల్లో లిఫ్టులు వినియోగించరాదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి



చీపురుపల్లి: ఎంఈఓ సమక్షంలో పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలలో చేరిన బాలబడి విద్యార్థులు



గజపతినగరం: పురిటిపెంటలో ప్రచారం చేస్తున్న ఎంఈఓ -2 సాయిచక్రధర్, ఉపాధ్యాయులు



లక్కవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను ఉపాధివేతనదారులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ ఎం.బూసినాయుడు అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మండ లంలోని పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిధిలో ఉన్న శోధన బాలబడికి చెందిన ఏడుగురు విద్యార్థులను పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ఇవ్వనున్న ట్లు చెప్పారు. హెచ్‌ఎం ఎం.విజయభారతి, ఉపాధ్యాయుడు ఎస్.వి.అప్పలనాయుడు, సీఆర్‌ఎంటీలు కె.రామకృష్ణ, గవిడి గణేశ్, బాలబడి ఉపాధ్యాయిని దుర్గ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు అంతా తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఎంఈఓ-2 సాయిచక్రధర్ కోరారు. మండలంలోని పురిటిపెంట-2 రెగ్యులర్ పాఠశాలను బుధవారం సందర్శించడంతో పాటు బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.అలాగే ప్రతీ గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్‌ఎం సింహాచలం, ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, ఎం.శంకరరావు, సీహెచ్.సర్వదేవుళ్లు, సీఆర్పీ కె.రామసూరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించండి

లక్కవరపుకోట: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని కొట్యాడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా జామి మండలంలోని కలగాడ గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులతో బుధవారం సమావేశమయ్యారు. తమ పాఠశాలలో సదుపాయాలు, విద్యార్థులు సాధించిన ఫలితాలతో కూడిన కరపత్రాలను వేతనదారులకు అందజేసి, అయిదో తరగతి పూర్తవుతున్న పిల్లలను చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు గుమ్మడి శ్రీనివాసరావు,బండారు నారాయణరావు, గొంప అవతారం, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



చామలాపల్లిలో రైతులను సన్మానిస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది

వేపాడ: పెట్టుబడి లేని, పర్యావరణ హితమైన, అన్ని విధాలా మేలైన ప్రకృతివ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని మండల ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ సన్యాసమ్మ అన్నారు. మండలంలోని చామలాపల్లి, జగ్గయ్యపేట గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు రసాయన ఎరువులు,క్రిమి సంహారక మందులను వాడకుండా తక్కు వ ఖర్చుతో ఘన, ద్రవ,జీవామృతాలు, కషాయాలను తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. భూసారం పెంచేందుకు నవధాన్యాలు సాగుచేయాలని సూచించారు.అనంతరం రైతులను సన్మానించారు. సర్పంచ్ కోలా సతీష్, గ్రామపెద్ద వంటాకు శ్రీను, వీ ఏఏలు దేముడు, కోమలి,తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గజపతినగరం 9010204447 · చీపురుపల్లి 9951602843 · ఎస్.కోట 9951602965

Office mail : vzmadvt@gmail.com